## క్లుప్తంగా

### అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న నాయకులు

సదుం: మండలంలోని కలకటవారిపల్లెలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు దళిత సంఘ నాయకులు ఆదివారం స్థల పరిశీలన చేశారు. విగ్రహ ఏర్పాటుకు గ్రామానికి చెందిన ఎర్రయ్య సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, తాతామల్లయ్య, చంద్రాయుడు, రెడ్డెప్ప, గోవిందయ్య, సీతాపతి, వెంకటరమణ, సూరి, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### బైక్ అదుపు తప్పి నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సదుం: రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడిన సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. బెంగళూరుకు నుంచి పీలేరు మండలంలోని మారంరెడ్డి గారిపల్లెకు దేవరాజులు ద్విచక్ర వాహనంలో కుటుంబ సభ్యులతో బయలుదేరారు. మార్గ మధ్యంలో భట్టువారిపల్లె సమీపంలో బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డారు. ప్రమాదంలో ఆయనతో పాటు భార్య లావణ్య, పిల్లలు రెడ్డి యువన్‌రాజు, దీపిక గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### చంద్రగిరిలో ఇసుక రీచ్‌లు నిలిపివేత



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష, సీఐ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలోని నాగయ్యగారిపల్లె, రెడ్డివారిపల్లెలో ఇసుక రీచ్‌లను నిలిపివేస్తున్నట్లు తహసీల్దార్ శిరీష, సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ, ఇసుక రీచ్‌లను నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇసుక రీచ్‌లలోకి ఎవరినీ అనుమతించడం లేదని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రీచ్‌ల వద్ద పర్యవేక్షించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు.

### సీఎం నిర్ణయం చరిత్రాత్మకం



కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘం నేతలు

తిరుపతి సిటీ: ఉద్యోగులకు ఏ రాష్ట్ర ప్రభుత్వమూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈఎల్స్ వర్తించే విధంగా జీవో 20 విడుదల చేయడం గర్వించదగ్గ విషయమని ఎస్వీయూ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం ఎస్వీయూ పరిపాలన కార్యాలయం వద్ద అధ్యాపకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. జీవో 39 విడుదల చేసి టీచింగ్ అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచారని తెలిపారు. అలాగే ఇది వరకు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేపట్టని ఎన్‌యాండ్‌మెంట్ లీవ్‌ను కల్పించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీ అధ్యాపకులు సీఎంకు రుణపడి ఉంటారని తెలిపారు. నాన్‌టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ త్వరలో నాన్‌టీచింగ్ ఉద్యోగులకు కూడా 60 నుంచి 62 ఏళ్లకు వయోపరిమితిని పెంచుతూ త్వరలో జీవో విడుదల కానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఉద్యోగులు ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ కే.మురళీరెడ్డి పాల్గొన్నారు.

### అభివృద్ధిని అడ్డుకుంటే గుణపాఠం

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర అభివృద్ధికి సహకరించకపోగా పసలేని ఆరోపణలు చేస్తూ అడ్డుతగులుతున్న నవీన్‌కుమార్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వైఎస్సార్ సీపీ సేవాదళ్ నేత తలారి రాజేంద్ర హెచ్చరించారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతిలో పలు ప్రాంతాలను అనుసంధానిస్తూ రోడ్లు వేస్తే అసాంఘిక కార్యక్రమాలు పెరుగుతాయని నవీన్‌కుమార్‌రెడ్డి చెప్పడం శోచనీయమని నిరసించారు.

# ప్రజలు మెచ్చుకునేలా అభివృద్ధి

- మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు: ప్రజలు మెచ్చుకునేలా పుంగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రహమత్‌నగర్, తూర్పుపాళ్యం, చెంగాలాపురం, మేలుపట్ల, దూళ్లవాళ్లఇండ్లు, తిరుపతి రోడ్డు ప్రాంతాలలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి వార్డుబాటను మంత్రి నిర్వహించారు. ముస్లిం మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. సమస్యలపై ఆరా తీశారు. రహమత్‌నగర్‌లో వికలాంగుడైన కరీముల్లా తనకు పెన్షన్ అందలేదని ఫిర్యాదు చేయడంతో తక్షణమే పెన్షన్ పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రహమత్ నగర్‌లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మంత్రి మాట్లాడారు. అలాగే ఇక్కడ బన్నూరు జాతి గొర్రెపిల్లను మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీల సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పికెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

**ప్రారంభోత్సవాలు**

శాంతినగర్‌లో రూ. 8లక్షలతో వేస్తున్న రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.9 లక్షలతో సరస్వతినగర్‌లో కాలువ పనులు, రూ.18 లక్షలతో హిదయత్‌నగర్‌లో కాలువ, రోడ్డు పనులను కూడా ప్రారంభించారు.



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**నేడు వార్డుబాట ఇలా ...**

సోమవారం వార్డుబాట కార్యక్రమాన్ని 1, 2, 7, 8, 15, 31 వార్డులలో మంత్రి నిర్వహిస్తారు.ఉదయం రాజీవ్‌గాంధీ వీధి, చౌడేపల్లె రోడ్డు, తాటిమాకుల పాళ్యం, షిరిడిసాయినగర్‌తో పాటు మదనపల్లె రోడ్డు, కొత్తయిండ్లు, కొత్తపేట, నక్కబండ ప్రాంతాలలో పర్యటిస్తారని మున్సిపల్ చైర్మన్ తెలిపారు.

**వార్డుబాటలో 47 సమస్యలు**

ఆదివారం నిర్వహించిన వార్డుబాట కార్యక్రమంలో 47 వినతిపత్రాలు అందాయని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఉద్యోగాల కోసం 11 మంది, బదిలీలకు 11 మంది, ఇళ్ల కోసం 18 మంది, ఉర్దూ కాలేజీ నిర్మించాలని ఒకరు, ఇతర సమస్యలపై ఆరుగురు వినతి పత్రాలు ఇచ్చారని వివరించారు.



వికలాంగుడైన కరీముల్లాతో మాట్లాడుతున్న మంత్రి



మంత్రికి సమస్య నివేదిస్తున్న మహిళ

### 'పట్టు' ప్రోత్సాహకాలు అందేలా చూడరూ!

**–మంత్రి పెద్దిరెడ్డికి పట్టు రైతుల వినతి**

గంగవరం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పలమనేరు నియోజకవర్గంలోని పట్టు రైతులు వినతి పత్రం ఇచ్చారు. ఆదివారం తిరుపతి నుంచి పుంగనూరు పర్యటనకు వెళ్తున్న మంత్రిని గంగవరం ఫ్లైఓవర్ వద్ద పట్టు రైతులు మర్యాదపూర్వకంగా కలిశారు. కిలోకు రూ.50 చొప్పున పలమనేరు, కుప్పం, పుంగనూరు, పూతలపట్టు నియోజకవర్గంలోని పట్టు రైతులకు నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి రావలసిన ప్రోత్సాహకాలను అందేలా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో పట్టు రైతులు, పలమనేరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, సుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, వాసుదేవరెడ్డి, గురుమూర్తి, శంకర్‌రెడ్డి, చంద్రప్పగౌడు తదితరులు ఉన్నారు.



మంత్రికి సమస్య వివరిస్తున్న పట్టు రైతులు

### ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో ఆంజనేయస్వామి

సదుం: స్థానిక గార్గేయనదీ తీరాన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ఆదివారం అభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమానికి ఎంపీటీసీ ఆనంద కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

### నియామకం



హరికుమార్

శాంతిపురం: ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా డుంకుమాకనపల్లెకు చెందిన వి.హరికుమార్ నియమితులయ్యారు. సంఘం జిల్లా కన్వీనర్ ప్రకాష్ పంపిన నియామక పత్రాన్ని ఆదివారం ఆయన అందుకున్నారు. హరికుమార్ మాట్లాడుతూ, అందరి సహకారంతో నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే సంఘం ఉపాధ్యక్షుడుగా నడింపల్లెకు చెందిన శ్రీనివాసులు, కోశాధికారిగా రామ్మూర్తి నియమితులయ్యారు.

## స్త్రీ జాతి స్వతంత్రాన్ని పరిరక్షించండి





అవగాహన కల్పిస్తున్న ఐద్వా రాష్ట్ర సభ్యులు

వి.కోట: మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టి స్త్రీ జాతి స్వతంత్రాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న మహిళల పోరుయాత్ర జాతను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి కోరారు. ఆదివారం వి.కోటలో ఐద్వా రాష్ట్ర సభ్యులు మహిళల హింసపై పోరుయాత్ర జాతను పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హింస లేని సమాజంగా తీర్చిదిద్దాలన్నదే తమ ఆశయమన్నారు. దీనిని అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలన్నారు. మహిళలు, చిన్నారులను రక్షణ కల్పించే చట్టాలను కఠినతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, కన్వీనర్ భువనేశ్వరి, ఇనాయతుల్లాఖాన్, అనిత, శ్యామల, కన్వీనర్ జీవిత తదితరులు పాల్గొన్నారు.

### గురువుకు పూర్వ విద్యార్థుల శ్రద్ధాంజలి

పలమనేరు: పట్టణానికి చెందిన విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయులు శ్రీనాథ్ ఆదివారం వృద్ధాప్య సమస్యలతో మృతిచెందారు. పలువురు పూర్వ విద్యార్థులు ఆదివారం ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పిన ఆయన సేవలు మరువలేనివని పూర్వవిద్యార్థులు చెప్పారు.

### సిపాయి భరోసా పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ గొల్లపల్లికి చెందిన సుబ్బమ్మ కుటుంబానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆదివారం 40 రకాల నిత్యావసర సరుకులతో కూడిన సిపాయి భరోసా కిట్టును అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, సర్పంచ్ ఈశ్వరమ్మ, స్థానిక నాయకులు గోపాల్‌రెడ్డి, మునిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం

పాలసముద్రం: రహదారి ప్రమాదాలపై అవగాహన అవసరమని, హెల్మెట్, మాస్క్ విధిగా ధరించాలని ప్రసాద్ కోరారు. ఆదివారం తన సిబ్బందితో కలసి బలిజకండ్రిగ–షోళింగర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి జరిమానా విధించి ఆయన మాట్లాడారు.

## భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన

- ప్రత్యేక పూజలకు హాజరైన మంత్రి పెద్దిరెడ్డి

సోమల: మండలంలో ఎస్.నడింపల్లె పంచాయతీ కరకమందలోని చెన్నమల్లయ్య తాత ఆలయంలో ఆదివారం భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారికి ఆలయ కార్యనిర్వాహకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మంత్రికి పెద్దిరెడ్డికి శివపార్వతుల చిత్రపటాన్ని గ్రామస్తులు అందజేసి సత్కరించారు. ఆ తర్వాత ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, నేతలు ఎంఆర్‌సీ రెడ్డి, నాగభూషణం రెడ్డి, మొగిళప్పగారి వాసుదేవయ్య, బెంగళూరు సాంబయ్య, మురళి, చెన్నమల్లయ్య, సర్పంచ్ వెంకటరమణ, వైస్ ఎంపీపీ ప్రభాకర, మాజీ సర్పంచ్ సదాశివయ్య, సోమల ఉప సర్పంచ్ వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డికి శివపార్వతుల చిత్రపటాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

## పొన్నియమ్మ తిరునాళ్లలో ఎమ్మెల్యే



తిరునాళ్లలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

గుడిపాల: మండలంలోని చుక్కావారిపల్లె గ్రామంలో ఉన్న పొన్నియమ్మ తిరునాళ్లలో ఆదివారం రాత్రి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆడినెల సందర్భంగా ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయనతోపాటు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు రజనీకాంత్, సాయి, శిలంబరసన్, భాస్కర్, పయణి పాల్గొన్నారు.

### వేడుకగా కుంభాభిషేకం



గంగమ్మను దర్శించుకుంటున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని కల్లిపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయ కుంభాభిషేకం పూజలు ఆదివారం వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. ఆమెకు గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, సర్పంచ్ నాగేంద్ర, నాయకులు పెరుమాళ్‌రెడ్డి, మునిరాజారెడ్డి, శోభన్ బాబు, సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

### అలరించిన హరికథాగానం

నగరి: చింతలపట్టెడలోని ద్రౌపదీ అమ్మవారి ఆలయ తిరునాళ్లలో భాగంగా ఆదివారం మహాభారత హరికథాగానం నిర్వహించారు. భాగవతారులు షకీల, కబాళీశ్వరన్ మహాభారత గాథను హరికథగా చెప్పారు.. తిరునాళ్లు ముగిసేంత వరకు ఆలయం వద్ద మహాభారత హరికథాగానం నిర్వహిస్తామని ఉత్సవ నిర్వాహకులు ఎంపీ నటరాజన్ తెలిపారు.

# ప్రజారోగ్యానికి పెద్దపీట

- నాడు–నేడు నిధులతో పీహెచ్‌సీల ఆధునికీకరణ
- పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం
- గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు
- 'ఫ్యామిలీ డాక్టర్'తో వైద్యసేవలు

**మండలంలో ఆరోగ్య కేంద్రాలు, సిబ్బంది వివరాలు**

| | |
|---|---|
| పీహెచ్‌సీలు : | 2 (రాయలపేట, పెద్దపంజాణి) |
| వైద్యాధికారులు : | 4 |
| స్టాఫ్ నర్సులు : | 6 |
| ఇతర సిబ్బంది : | 14 |
| వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ : | 18 |
| ఎంఎల్‌హెచ్‌పీలు : | 18 |
| సచివాలయం ఏఎన్‌ఎంలు : | 19 |
| ఆశావర్కర్లు : | 49 |





చలమంగళం విలేజ్ క్లినిక్

పెద్దపంజాణి: అందరికీ ఆరోగ్యం.. అదే ప్రతి ఇంటికీ సౌభాగ్యం.. అనే నినాదంతో వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. పల్లె ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో ఆరోగ్య కేంద్రాలను నాడు–నేడు నిధులతో ఆధునీకరించింది. అన్ని వసతులు సమకూర్చింది. పూర్తి స్థాయిలో సిబ్బంది నియమించింది. ప్రతి సచివాలయానికి అనుబంధంగా విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తోంది. మరో వైపు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో వైద్యాధికారులు ఇళ్ల వద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు.

**అందుబాటులో మందులు: 64 రకాలు**

డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌తో నిత్యం వైద్య సేవలు అందించేందుకు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పి)లను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు ఆ ప్రాంత ఏఎన్‌ఎం, ఆశావర్కర్ అందుబాటులో ఉంటున్నారు. ఎంఎల్‌హెచ్‌పీల వద్ద 64 రకాల మందులు ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. వీటిని అవసరమైన రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలతో పాటు 14 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా అత్యాధునిక కిట్లు సైతం ఇచ్చారు.

**'ఫ్యామిలీ డాక్టర్' సేవలు**

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు 104 వాహనం ద్వారా వైద్య సేవలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయి. గ్రామాల్లో మంచాన పడ్డ రోగులను నేరుగా ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేసి మందులు అందించే కొత్త విధానాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ప్రతి గ్రామాన్ని నెలకు రెండు సార్లు వైద్యులు సందర్శించి ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్స చేయించుకున్న రోగులను, ఇతర రోగాలతో మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల గురించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా వైద్య సేవలు అందుతుండంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

**తక్షణమే వైద్యసేవలు**



గతంలో చిన్న జబ్బు చేసినా నానా ఇబ్బందులు పడేవాళ్లం. ఆర్ఎంపీల కోసం ఎదురు చూసేవాళ్లం. జగనన్న పుణ్యమాని విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో మెరుగైన వైద్య సేవలు, మందులు అందుబాటులోకి వచ్చాయి. అనుక్షణం హెల్త్ ప్రొవైడ్, ఏఎన్ఎం, ఆశా వర్కర్ రోగుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. అవసరమైతే ఇంటికే వచ్చి మందులు ఇస్తున్నారు.

–శ్రీనివాసులు రెడ్డి, బట్టందొడ్డి

**ఇంటి వద్దనే వైద్య సేవలు**



వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ ఫిజీషియన్‌తో వైద్య సేవలు ఇంటి వద్దనే అందుతున్నాయి. గత ప్రభుత్వంలో వైద్యం కోసం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడ మందులు లేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న పాలనలో వైద్యులు ఇంటి వద్దకే వచ్చి చికిత్స చేయడమే కాకుండా ఉచితంగా మందులు ఇస్తున్నారు.

–రామయ్య, కొత్తబూరగపల్లె

**పూర్తి స్థాయిలో వైద్య సేవలు**



ప్రతి గ్రామానికి నెలకు రెండుసార్లు వెళుతున్నాం. వివిధ జబ్బులతో బాధపడుతున్న రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స చేస్తున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఒకే గ్రామంలో ఉంటూ ఓపీ చూస్తున్నాం. మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నాం. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా మా సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

–మురళీకృష్ణ, వైద్యాధికారి, పెద్దపంజాణి పీహెచ్‌సీ


### ఆడికృత్తిక వేడుకలకు ముస్తాబు

- డిప్యూటీ సీఎం చొరవతో రూ.75 లక్షలు మంజూరు



ఆలయం వద్ద జేసీబీతో బండల తొలగింపు పనులు

కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన స్థానిక స్కంధ పుష్కరిణి సమీపంలో కుమార గిరిపై ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ఈ నెల 8వ తేదీ నుంచి ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో ఆలయ అభివృద్ధికి రూ. 75 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆలయం చుట్టు పార్కింగ్ ఏర్పాటుకు జేసీబీలతో బండలను తొలగించి, భక్తులు నిద్ర చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రూ.40 లక్షలతో ఆలయానికి ప్రహరీగోడ నిర్మించారు. ఆలయంలో రూ.35 లక్షలతో ఫ్లోరింగ్ ఏర్పాటు చేశారు. కుమార గిరికి భక్తుల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు వేశారు. ఆలయం పై భాగం ఉరుపులు లేకుండా పనులు చేశారు. ఆలయ ఆవరణలో దాతల సాయంతో పోటు నిర్వహణకు భవనాన్ని నిర్మిస్తున్నారు.



కళకళలాడుతున్న స్కంధ పుష్కరిణి